క్లుప్తంగా

వంతెన పనుల పరిశీలన



వంతెన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: ప్రధాన పంట కాలువపై చింతా వారిపేట, ఉచ్చులవారిపేటల మధ్య నిర్మిస్తున్న వంతెన పనులను ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు బుధవారం పరిశీలించారు. త్వరితగతిన నిర్మాణాన్ని పూర్తి చేసి, వశిష్ట నదిపై వంతెన పనులను ప్రారంభించాలని చిట్టిబాబు కాంట్రాక్టు సంస్థకు సూచించారు. ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక గ్రామాల ప్రజల కోసం వశిష్ట నదిపై వంతెన నిర్మాణానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.49.5 కోట్లు మంజూరు చేసిన విషయం విదితమే. ఈ ప్యాకేజీలో భాగంగా ముందుగా ప్రధాన పంట కాలువపై వంతెనను నిర్మిస్తున్నారు. మండల జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు, వైఎస్సార్ సీపీ యూత్ నాయకులు కొండేటి స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

లో-ఓల్టేజీ సమస్యకు చెక్



పాశర్లపూడిలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

మామిడికుదురు: పాశర్లపూడి గ్రామ పరిధిలోని నెల్లివారిమెరకలో ఎట్టకేలకు సింగిల్ ఫేజ్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. దీన్ని ఏర్పాటు చేయడం వల్ల స్థానికంగా ఉన్న లో-ఓల్టేజ్ సమస్య పూర్తి స్థాయిలో పరిష్కారమవుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఉన్న సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. పాడైపోయిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానే కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు ఏడాది సమయం పట్టింది. లో-ఓల్టేజ్ సమస్యపై నాలుగు రోజుల క్రితం స్థానికులు నిరసన తెలియజేశారు. ఈ ఆందోళనతో స్పందించిన అధికారులు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు.

ఆధార్ కేంద్రాన్ని పునరుద్ధరించాలి

మామిడికుదురు: గ్రామ సచివాలయం-1లో ఆరు నెలల నుంచి మూతపడిన ఆధార్ కేంద్రాన్ని పునరుద్ధరించాలని రాజోలు నియోజకవర్గ రైతు అధ్యక్షుడు ఈలి శ్రీనివాస్ బుధవారం డిమాండ్ చేశారు. ఇక్కడి ఆధార్ కేంద్రం మూత పడడం వల్ల మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఆధార్ సేవల కోసం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ప్రభుత్వం ఆధ్వర్యంలోనే ఆధార్ కేంద్రాలు పనిచేయాలన్న ఆదేశాల మేరకు ప్రైవేటు ఆధార్ కేంద్రాలను తొలగించారన్నారు. అటువంటి సందర్భంలో ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఆధార్ కేంద్రాన్ని ఏ విధంగా మూసేశారని ఆయన ప్రశ్నించారు. దీనిపై అధికారులు పరిశీలన చేసి ఆరు నెలలుగా మూత పడిన ఆధార్ కేంద్రాన్ని తక్షణం పునరుద్ధరించాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

కుష్టు వ్యాధి నిర్ధారణపై సమగ్ర సర్వే నిర్వహించాలి

ఆలమూరు: కుష్టు వ్యాధి నిర్ధారణపై సమగ్ర సర్వే నిర్వహించి వ్యాధిగ్రస్తులను గుర్తించాలని కొత్తపేట డివిజన్ అదనపు జిల్లా వైద్యాధికారి ఎం.సుమలత అన్నారు. మండలంలోని చొప్పెల్ల పీహెచ్‌సీలో బుధవారం వైద్యాధికారి డి.సువర్చలానాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో సూపర్‌వైజర్లు ఎస్.వెంకటేశ్వరరావు, సీహెచ్ బేబి తదితరులు కుష్టు వ్యాధి నిర్మూలనకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కుష్టు వ్యాధి రోగులను గుర్తించేందుకు 36 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఆ సర్వేలో గుర్తించిన రోగులకు అందుబాటులోకి వచ్చిన డాట్ చికిత్సను అందజేయాలన్నారు. కుష్టువ్యాధి నిర్మూలన ధ్యేయంగా పనిచేస్తున్న ఆరోగ్య ఆశ సిబ్బంది తమ వంతు కృషి చేయాలని ఆమె సూచించారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, సర్పంచ్ దంగేటి చంద్రకళ పాల్గొన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

మామిడికుదురు: పాశర్లపూడి వైనతేయ వారధిపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న కొమరాడ గ్రామానికి చెందిన చెల్లింగి నాగప్రసాద్ (32) మృతదేహం బుధవారం సాయంత్రం లభ్యమైంది. బ్రిడ్జికి మూడు కిలోమీటర్ల దూరంలో పాశర్లపూడి వైపు మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు పోస్టుమార్టం కోసం రాజోలు ప్రభుత్వాస్పత్రికి పంపించారు. మానసిక పరిస్థితి సరిగ్గా లేకపోవడంతో పాటు మృతుడి భార్య, తల్లి మధ్య తరచూ జరిగే గొడవల నేపథ్యంలో నాగప్రసాద్ మానసిక వేదనకు గురై మంగళవారం బ్రిడ్జిపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడని నగరం ఎస్సై షేక్ జానీబాషా తెలిపారు.

ర్యాలి ఆలయ అభివృద్ధికి విరాళం

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవ స్వామి ఆలయ అభివృద్ధి పనులకు రాజమహేంద్రవరానికి చెందిన లంకే ధనరాజు రూ.10,116 విరాళం అందించినట్లు ఆలయ ఈఓ బి. కృష్ణ చైతన్య తెలిపారు. దాతకు ఈఓ చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందించారు.

శరవేగంగా జాతీయ రహదారి పనులు

- రాష్ట్ర ప్రభుత్వం చొరవతో చురుగ్గా పనులు
- కలెక్టర్ జోక్యంతో భూసేకరణ సమస్యల పరిష్కారం
- దిండి-చించినాడ వంతెన మరమ్మతులూ పూర్తి



గెద్దాడ వద్ద పూర్తయిన హైవే కల్వర్టు నిర్మాణం



పాలగుమ్మి-బి.సావరం మధ్య చురుగ్గా సాగుతున్న జాతీయ రహదారి పనులు

మలికిపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ప్రధానమైన 216 జాతీయ రహదారి పనులు పురోగతి మొదలైంది. గత ఆరు నెలలుగా నిర్మాణం పనులు వేగం పుంజుకున్నాయి. జిల్లాలో అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో ఈ రహదారి పనులు దాదాపు పూర్తయినా రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లో 20.92 కిలోమీటర్ల మేర గత టీడీపీ హయాం నుంచీ పదేళ్లుగా ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఈ రహదారి పనులు సాగాయి. గతేడాది క్రితం నుంచీ ఈ రహదారి పనులపై రాజోలు, పి.గన్నవరం ఎమ్మెల్యేలు రాపాక వర ప్రసాదరావు, కొండేటి చిట్టిబాబులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లాతో పాటు ఇతర జాతీయ రహదారి అధికారులతో సంప్రదింపులు జరిపారు. దీంతో ఇక్కడ ఉన్న భూ సేకరణలో ఇబ్బందులను జిల్లా కలెక్టర్ పరిష్కరించి పనుల పూర్తికి మార్గం సుగమం చేశారు. కోస్తా జిల్లా రవాణా మెరుగుదలలో భాగంగా కత్తిపూడి నుంచి మొదలైన ఈ రహదారి జిల్లాలో పాశర్లపూడి, మామిడికుదురు, తాటిపాక, రాజోలు, శివకోడు, దిండి మీదుగా పశ్చిమగోదావరి జిల్లాలో ప్రవేశించి మచిలీపట్నం మీదుగా ఒంగోలు వరకూ దాదాపు 400 కిలోమీటర్ల పొడవునా ఈ జాతీయ రహదారి ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా గత 15 ఏళ్ల క్రితం దీనికి నాలుగు లేన్ల రహదారిగా అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. తొలుత చురుకుగా సాగిన దీని పనులు గత పదేళ్లుగా నత్త నడకన సాగాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 216 జాతీయ రహదారి పనులు వేగంగా సాగాయి. మొత్తం 20.82 కిలో మీటర్లకు గాను 12 కిలోమీటర్ల రోడ్డు పూర్తయింది. ఈ రోడ్డులో మొత్తం 16 మేజర్ కల్వర్టులు, 22 మైనర్ కల్వర్టుల నిర్మాణం పూర్తి కాగా కేవలం పాశర్లపూడిలో 6 కల్వర్టుల నిర్మాణం మాత్రమే మిగిలి ఉంది. ఇక్కడ భూసేకరణ పూర్తయినా కేంద్రం ఎకరాల్లో పరిహారం ఇస్తుండగా రైతులు ఇక్కడ గజాలలో పరిహారం కోరడంతో అధికారుల దృష్టిలో ఉంది. మిగిలిన ప్రాంతంలో కల్వర్టుల వద్ద రోడ్డు అప్రోచ్‌ల పనులు కూడా వేగంగా సాగుతున్నాయి. దిండి నుంచి చింతలపల్లి వరకూ కల్వర్టుల అనుసంధానం కూడా పూర్తి కావస్తుంది. అలాగే శివకోడు లాకుల వద్ద గతంలో ఫ్లైఓవర్ నిర్మాణం చేద్దామని భావించారు. అయితే తాజాగా ఇక్కడ రీ అలైన్‌మెంట్ చేస్తున్నారు. దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటారు. ఈ భారీ నిర్మాణాలు తప్ప మిగిలిన రోడ్డు పనులు వేగంగా సాగుతున్నాయి.

పెరిగిన రద్దీ

గడచిన పదేళ్లుగా నిమిషానికి అరవై నుంచి డబ్బై వాహనాలు రాకపోకలు సాగించే రహదారి ఇది. జాతీయ రహదారిగా మారడం, చాలా చోట్ల నాలుగు లేనూళ్ల పనులు పూర్తి కావడంతో ఈ రహదారిలో వాహనాల తాకిడి తీవ్రమైంది. చెన్నై నుంచి విశాఖపట్నం, కోల్‌కతా రాకపోకలు సాగించే వాహనాలు కూడా ఒంగోలులో ఎన్‌హెచ్ 16ను వీడి 216 జాతీయ రహదారి ద్వారా కోనసీమ జిల్లా ద్వారానే రాకపోకలు సాగించడం కూడా మొదలైంది.

దిండి వంతెన మరమ్మతులు పూర్తి

జాతీయ రహదారి పనుల్లో భాగంగా డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ-పశ్చిమగోదావరి జిల్లాల మధ్య గోదావరి నదిపై ఉన్న దిండి-చించినాడ వంతెన కూడా మరమ్మతులు పూర్తి చేశారు. గత కొంత కాలంగా ఇది పూర్తిగా పాడైపోయి గుంతలు పడింది. జాతీయ రహదారి పనుల కారణంగా దిండి వైపు అప్రోచ్ కూడా అత్యంత ప్రమాదకరంగా మారింది. ఇటీవల పలు ప్రమాదాలు సంభవించి ప్రాణాలు కూడా పోయాయి. వంతెన పై నుంచి లారీ పడిపోయి ఇద్దరు చనిపోయారు. పరిస్థితిని గమనించిన జాతీయ రహదారి అధికారులు ఈ వంతెన మరమ్మతులు కూడా పూర్తి చేశారు.

హైవే పనుల్లో పురోగతి



గత ప్రభుత్వాల నిర్వాకం వల్ల రాజోలు దీవిలో జాతీయ రహదారి పనులు నత్తనడకన సాగాయి. గత రెండేళ్లుగా సీఎం జగన్‌తో చర్చించి, జిల్లా కలెక్టర్ ద్వారా భూసేకరణ సమస్యలు తొలగించాం. మరో ఆరు నెలల్లో దాదాపు హైవే పనులు పూర్తయ్యేలా ప్రణాళిక రూపొందించాం.

– రాపాక వరప్రసాదరావు, ఎమ్మెల్యే, రాజోలు

శివకోడు వద్ద రీ ఎలైన్‌మెంట్



రాజోలు దీవిలో జాతీయ రహదారి 216 పనులు వేగంగా సాగుతున్నాయి. మొత్తం పనులల 65 శాతం పూర్తయ్యాయి. శివకోడు లాకుల వద్ద ఆర్ అండ్‌బీ రోడ్డు, జాతీయ రహదారి క్రాసింగ్ వద్ద రీ ఎలైన్‌మెంట్ వేశాం. త్వరలో నిర్ణయం తీసుకుంటాం.

– కె.పురుషోత్తంరాజు, ఏఈ, ఎన్‌హెచ్ 216

పళ్లాలమ్మ హుండీ ఆదాయం రూ.2.61 లక్షలు

కొత్తపేట: మండలంలోని వానపల్లి గ్రామదేవత పళ్లాలమ్మ అమ్మవారి దేవస్థానం హుండీ ద్వారా 42 రోజులకు రూ.2,61,800 ఆదాయం వచ్చినట్టు దేవస్థానం పాలకమండలి చైర్మన్ కామిశెట్టి అమ్మన్న, ఈఓ బొక్కా వీరవెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం దేవదాయ శాఖ అధికారులు, గ్రామ పెద్దల సమక్షంలో హుండీ తెరచి లెక్కించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు, స్థానిక నాయకులు సబ్బితి సత్యనారాయణ, ఇళ్ల రాంబాబు, కంచుస్తంభం రాంబాబు, కట్టా రాంబాబు, బండారు సత్తిరాజు, దేప్పలపూడి మాధవరావు, బండారు పేర్రాజు, బండారు సత్తిబాబు, దేవస్థానం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

మలికిపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టుల భర్తీకి బుధవారం ఎంపీడీఓ ముత్యం వీరాస్వామి నాయుడు ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మలికిపురం, లక్కవరం, కేశనపల్లి గ్రామాల నుంచి 4 వలంటీర్ల పోస్టులకు అభ్యర్థులు హాజరయ్యారు, ఇంటర్వ్యూల అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ ఎంపికైన అభ్యర్థుల పేర్లను త్వరలో ప్రకటిస్తామన్నారు.

నేడు మార్కెట్ కమిటీ సమావేశం

అంబాజీపేట: స్థానిక మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశం గురువారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ వేటుకూరి వెంకటరాజు తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారన్నారు. పాలకవర్గ సభ్యులంతా విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

రోగులకు అందుబాటులో ఉండాలి



వాకలగరువులో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ దుర్గారావుదొర

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లోని రోగులకు ఎళ్లవేళలా అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించి, వారికి ధైర్యం కల్పించాలని అమలాపురం డీఎంఅండ్‌హెచ్‌ఓ ఎం.దుర్గారావుదొర అన్నారు. నందంపూడి, తొండవరం, వాకలగరువు, మాచవరం-4 గ్రామాల్లో సచివాలయాల్లో నిర్వహిస్తున్న వైద్య సబ్ సెంటర్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతోల్లో ఉన్న గర్భిణులను, బాలింతలను పరీక్షించి పౌష్టికాహారంతో పాటు వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏఎన్ఎంలు, ఆశాలు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో డెలివరీలకు వచ్చేలా వారిని ప్రోత్సహించాలన్నారు. గ్రామాల్లో నిర్వహించే ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, 104ల వల్ల ఉపయోగాలను ప్రజలకు వివరించాలన్నారు. రోగుల ఇళ్ల వద్దకే వచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్‌పై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి వారి సంపూర్ణ ఆరోగ్యానికి దోహదపడాలన్నారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ హెల్త్‌పై వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అంతకుముందు నాలుగు సచివాలయాల్లోను రికార్డులను తనిఖీ చేశారు. సబ్ సెంటర్‌లో అందుతున్న వైద్యం, మందులపై ఆరాతీశారు. ఆయన వెంట పీహెచ్‌ఎన్ రత్నకుమారి, హెల్త్ అసిస్టెంట్ జేవీఎస్ఆర్.ప్రసాద్, ఏఎన్ఎంలు ఎన్.జ్యోతి రత్నకుమారి, ఎన్.జయంతి. జి.గౌరీశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు ఉన్నారు.

పాలవెల్లువపై అవగాహన సదస్సు

అయినవిల్లి: మండలంలోని తొత్తరమూడి, మాగాం గ్రామ పంచాయతీల వద్ద జగనన్న పాలవెల్లువపై పశుసంవర్ధకశాఖ పీడీ శివశంకర్‌ప్రసాద్, జేడీ కేవీఎస్ మూర్తి ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పీడీ శివశంకర్‌ప్రసాద్ మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా పాల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. పాల ఉత్పత్తులు పాడి రైతుల అదనపు ఆదాయం సముపార్జించవచ్చన్నారు. ఈ సదస్సు గ్రామ సర్పంచులు వారా జయసావిత్రి, కాశి వీవీ సత్యనారాయణమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకింగ్ వ్యవస్థపై విద్యార్థులకు అవగాహన



కొత్తపేటలో క్విజ్ పోటీల విజేతలతో ఎంఈఓ హరిప్రసాద్, బీఎం కాశీవిశ్వనాథ్



అంబాజీపేటలో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎంఈఓలు, బ్యాంక్ మేనేజర్

కొత్తపేట: విద్యార్థులు తమ క్లాస్ సబ్జెక్టులతో పాటు బ్యాంకింగ్ వ్యవస్థ, కార్యకలాపాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్, యూనియన్ బ్యాంక్ స్థానిక బ్రాంచ్ మేనేజర్ ఎస్.కాశీవిశ్వనాథ్ సూచించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 'ఆల్ ఇండియా క్విజ్ ఆన్ ఫైనాన్షియల్ లిటరసీ-2023' సబ్జెక్ట్‌పై బుధవారం స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో మండల పరిధిలోని 12 పాఠశాలల నుంచి 12 టీమ్‌లకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఎంఈఓ హరిప్రసాద్ మట్లాడుతూ ఆర్‌బీఐ ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంక్ వారు ఇటువంటి పోటీలు నిర్వహించడం విద్యార్థుల్లో పోటీతత్వంతో పాటు ఆర్థిక ప్రోత్సాహాన్నిస్తాయన్నారు. ఈ క్విజ్ పోటీల్లో జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు సయ్యద్ రజియాబేగం, కె.సాయిసింధు టీమ్ మొదటి స్థానం, కొత్తపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు కేఎంఎస్ఎస్ సుభాష్, ఎన్.ఉదయకిరణ్ టీమ్ ద్వితీయ స్థానం, స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆర్.నగేష్, ఎం.లోకేష్ టీమ్ తృతీయ స్థానం సాధించగా వారికి వరుసగా రూ.5,000, రూ.4,000, రూ.3,000 చొప్పున నగదు బహుమతితో పాటు పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్స్ ఎంఈఓ, బీఎంల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎస్.సత్యనారాయణ, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలి

అంబాజీపేట: ప్రస్తుత తరుణంలో ప్రతి ఒక్క విద్యార్థి ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని మండల విద్యాశాఖాధికారులు జయంతి కనకదుర్గ, మోకా ప్రకాష్‌లు అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూలులో స్థానిక యూనియన్ బ్యాంక్ మేనేజర్ ఎంవీ రమణ పర్యవేక్షణలో రిజర్వ్ బ్యాంకు ఆదేశాల మేరకు ఆర్థిక సమీకృత మరియు అభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో మండలంలోని హైస్కూల్ విద్యార్థులకు క్విజ్ పోటీలను బుధవారం నిర్వహించారు. మేనేజర్ ఎంవీ రమణ మాట్లాడుతూ 2023 అఖిల భారత స్కూల్ క్విజ్ పోటీల్లో భాగంగా మండలంలోని 9 హైస్కూళ్ల నుంచి టీంకు ఇరువురు చొప్పున 18 మందికి పోటీలు నిర్వహించి వారిలో ప్రథమ బహుమతిగా రూ.5 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.4 వేలు, తృతీయ బహుమతిగా రూ.3 వేలుతో పాటు సర్టిఫికెట్లు పంపిణీ చేశామన్నారు. నగదును వారి ఖాతాలలో జమ చేస్తామన్నారు. మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులు త్వరలో జరగబోయే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ కేఎస్ రాజు,సిబ్బంది కె.ఈశ్వరరావు, హైస్కూలు ఇంచార్జి హెచ్ఎం బి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు ఎస్.సుధాకర్‌బాబు, వీఎస్ఎన్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- ఘనంగా ప్రపంచ యోగా దినోత్సవం
- పలు కళాశాలల్లో విద్యార్థుల విన్యాసాలు



మాచవరంలో యోగా చేయిస్తున్న గురువు శ్రీనివాస్



మలికిపురంలో యోగా చేస్తున్న అధ్యాపకులు

అంబాజీపేట: నిత్యం యోగా చేయడం వల్ల రోగాల బారిన పడకుండా, మానసిక ప్రశాంతతతో పాటు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటామని యోగా గురువు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ అన్నారు. మాచవరంలో ఉన్న స్వామి వివేకానంద యోగా ఆశ్రమంలో శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రపంచ యోగా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. యోగా విద్య, జీవన నైపుణ్యం, ప్రాణాయామాల శ్రీనివాస్ వివరించారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో ఇన్‌చార్జి హెచ్‌ఎం బొక్కా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కోనసీమ ఆయుష్ ఆధ్వర్యంలో యోగా డే నిర్వహించారు.

మలికిపురం: ప్రపంచ యోగా దినోత్సవాన్ని మండలంలో పలు చోట్ల నిర్వహించారు. విశ్వేశ్వరాయపురం వివేకానంద కాన్వెంట్‌లో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు యోగా చేశారు. ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. కరస్పాండెంట్ పీవీవీ ప్రసాద్ యోగాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే మలికిపురం ఎంవీఎన్ జేఎస్అండ్ఆర్వీఆర్ ప్రభుత్వం ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన యోగా దినోత్సవంలో అధ్యాపకులు యోగా చేశారు. ప్రతి ఒక్కరూ యోగా చేయాలని తద్వారా ఆరోగ్యంగా ఉండాలని ప్రిన్సిపాల్ తోరం సతీష్ సూచించారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

మామిడికుదురు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని జాతీయ యోగా కోచ్ చిట్టూరి చంద్రశేఖర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా మామిడికుదురు ఉన్నత పాఠశాలలో బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఆ పార్టీ నేతలు మెండా ఆదినారాయణ, కంకిపాటి సుబ్బారావు, పసుపులేటి మహాలక్ష్మీరావు, నక్కా త్రిలోచనరావు పాల్గొన్నారు. మామిడికుదురు దీప్తి, నగరం సాయిదీప్తి స్కూళ్లలో కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో జాతీయ యోగా కోచ్ చంద్రశేఖర్ విద్యార్థులతో యోగసనాలు వేయించారు.

కొత్తపేట: శారీరక, మానసిక ఉల్లాసానికి యోగా ఎంతగానో దోహదపడుతుందని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ పీఓ ఎస్.అరుణ్‌కుమార్, కళాశాల పీడీ కె.కనకరాజు సంయుక్త ఆధ్వర్యంలో యోగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు పాలాటి మాధవస్వామి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో యోగా దినోత్సవం, అవగాహన సదస్సు నిర్వహించారు. రాష్ట్ర పార్టీ స్వచ్ఛభారత్ కన్వీనర్ పాలూరి సత్యానందం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వ్యాయామోపాధ్యాయుడు కముజు సత్యనారాయణ యోగాసనాలు వేయించారు. వివేకానంద యోగా శిక్షణా కేంద్రంలో యోగా మాస్టర్ ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. శిక్షణా కేంద్రం విద్యార్థులతో వివిధ యోగాసనాలు చేయించారు.

పి.గన్నవరం: యోగాతో సంపూర్ణ ఆరోగ్య చేకూరుతుందని ఎంపీపీ అంబటి భూలక్ష్మి అన్నారు. ఉపాధి హామీ పథకం ఏపీఓ బి.చంద్రమోహన్ ఆధ్వర్యంలో మండలంలోని నరేంద్రపురం అమృత్ సరోవర్ వద్ద బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంపీపీ తదితరులు యోగా ఆసనాల్లో పాల్గొన్నారు. ఎంపీటీసీ కొక్కిరి లక్ష్మి, అంబటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. పి.గన్నవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో యోగా దినోత్సవాన్ని హెచ్‌ఎం డీఎస్‌వీ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులు యోగాసనాలు వేశారు. ఎంఈఓ కోన హెలీనా, చింతా వీరభద్రం, యూనియన్ బ్యాంకు మేనేజర్, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: మండలంలోని అంతర్వేదికర, మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో బోధనా సిబ్బంది యోగా దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. అంతర్వేదికరలో ఉన్నత పాఠశాలలో యోగా గురువు మన్నె సత్యనారాయణ, యోగా విశిష్టత, ఉపయోగాల గురించి వివరించారు. విద్యార్థుల్లో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెంపొందించడానికి యోగా ఉపయోగపడుతుందన్నారు. వివిధ ఆసనాలపై విద్యార్థులతో ఆయన ప్రాక్టీస్ చేయించారు. హెచ్‌ఎం పీఎస్ సూర్యకుమారి, పీడీ భాస్కర్, బోధనా సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పీఈటీ కె.కృష్ణప్రసాద్ విద్యార్థులతో ఆసనాలు వేయించారు.

రావులపాలెం: స్థానిక పోతంశెట్టి రామిరెడ్డి పార్క్‌లో బుధవారం సత్యాయోగ విద్యాలయ యోగా కోచ్ ఈ.సత్యశ్రీ ఆధ్వర్యంలో యోగా డే నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు పలు యోగాసనాలు వేసి వాకర్స్‌ను అబ్బురపరిచారు. కార్యక్రమంలో అసిస్టెంట్ యోగ కోచ్ వీటి సంధ్యారాణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మామిడికుదురులో యోగాసనాలు వేయిస్తున్న జాతీయ కోచ్ చంద్రశేఖర్



పి.గన్నవరం ఉన్నత పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు

నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు



పొదలాడలో విత్తనాల షాపు తనిఖీ చేస్తున్న అధికారులు

రాజోలు: నకిలీ విత్తనాలు విక్రయించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌చార్జి ఎస్పీ కె.కుమార్ సూచించారు. బుధవారం పొదలాడలో విత్తనాలు విక్రయిస్తున్న షాపులో విజిలెన్స్, వ్యవసాయాధికారులు తనిఖీలు నిర్వహించారు. కొన్ని బ్రాండ్లకు చెందిన విత్తనాలైన మిరపకాయ, గుమ్మడికాయ, స్వీట్‌కార్న్, క్యాప్సికమ్ విత్తనాల ధ్రువీకరణ పత్రాలు, స్టాక్ రిజిస్టరు లేకపోవడంతో 6-ఏ కేసు నమోదు చేశారు. రూ.5,130 విలువైన 429 గ్రాముల విత్తనాలను సీజ్ చేశారు. అలాగే రూ.25,210 విలువైన మూడు కేజీల విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేశారు. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ సత్యకిషోర్, జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ, కానిస్టేబుళ్లు వలీ, లోవరాజు పాల్గొన్నారు.

పలువురికి సాయం అందజేత



మదర్‌థెరిసా ఆశ్రమానికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు

రావులపాలెం: రాజమహేంద్రవరానికి చెందిన ఈ.విజయ్ యూరప్‌లోని ఓ దేశానికి ఉద్యోగం కోసం వెళ్లాడు. అతడికి ఉద్యోగంలో ప్రమోషన్ రావడంతో బుధవారం స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులకు రూ.20 వేలు విలువైన వస్తువులను ఊబలంకలోని మదర్‌థెరిసా ఆశ్రమంలో ఒక సీలింగ్ ఫ్యాన్, మూడు ట్యూబ్‌లైట్లు, నిత్యావసరాలు, ఆశ్రమంలో వారికి కొత్తబట్టలు, అలాగే రావులపాలెం కాలువ అవతల గల బ్లైండ్ హాస్టల్లో వారికి నిత్యావసరాలు, కొత్తబట్టలు, రెయిన్ కోట్స్, రెండు చోట్ల అన్నదానం చేయడానికి సాయం అందజేశారు. విజయ్ తమ సేవా సంస్థ ద్వారా ఈ సాయం అందజేడం సంతోషంగా సభ్యులు తెలిపారు.

మడుపల్లిలో 'ఫ్యామిలీ డాక్టర్'

అయినవిల్లి: మండలంలోని మడుపల్లిలోని రాయుడు పాలెంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా స్థానికులకు వైద్య సేవలందించారు. వైద్యాధికారి బి.మంగాదేవి 48 మంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. మంచానికి పరిమితమైన రోగులను పరీక్షించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఫుడ్‌ను పరీక్షించారు. చిన్నారులకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పిస్తారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎం.శ్రీరాములు, ఏఎన్ఎం ఆర్.రాజారత్నం, ఎంఎల్‌హెచ్‌పీ జి.సింధునాగదుర్గ, ఆశా వర్కర్లు జి.భాగ్యలక్ష్మి, పి.శివారాణి కుమారి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు తప్పనిసరి

ఆలమూరు: చిన్నారులకు నిర్ణీత సమయంలో విధిగా టీకాలు వేయించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎం.సుమలత, పి.భవానీశంకర్ అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లతో పాటు ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్ సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలు వేశారు. వైద్యాధికారుల ఆధ్వర్యంలో సీహెచ్‌ఓ పి.వెంకటరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎస్.వెంకటేశ్వర్లు, పి.ఉమ, సీహెచ్ బేబి వైద్యసేవలను పర్యవేక్షించారు. బాలింతలకు, గర్భిణులకు బలవర్ధక ఔషధాలను, యాంటీ బయాటిక్ మందులను అందజేశారు. హెల్త్, అంగన్‌వాడీ, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

విలేకరి మృతికి సంతాపం



గంటి శ్రీరాములు (ఫైల్)

ఆత్రేయపురం: మండల ఆంధ్రప్రభ విలేకరిగా పని చేస్తున్న వాడపల్లి గ్రామానికి చెందిన గంటి శ్రీరాములు బుధవారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మృతికి ప్రజా ప్రతినిధులు, విలేకరులు సంతాపం వ్యక్తం చేశారు.

ధర్మ పోరాట సభకు తరలివెళ్లాలి

పి.గన్నవరం: తాడిపత్రిలో ఈనెల 25న జరగనున్న మాదిగల ధర్మ పోరాట సభకు వేలాదిగా తరలివెళ్లి విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి ఉప్పాటి రాజేష్, మండల అధ్యక్షుడు ఉండ్రాజవరపు సురేష్ అన్నారు. దీనికి సంబంధించిన పోస్టర్లను నాగుల్లంకలో బుధవారం జరిగిన కార్యక్రమంలో వారు విడుదల చేశారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ పాల్గొన్నారు.